క్లుప్తంగా

మడకశిర ఎస్ఐగా లోకేశ్



మడకశిర: మడకశిర నూతన ఎస్ఐగా లోకేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు మునుపు ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న ఇషాక్‌బాషాను వీఆర్‌కు పంపారు. ఈనేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు అతని స్థానంలో లోకేశ్‌ను ఎస్ఐగా నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడడానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్య కలాపాలపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు. ఆతర్వాత ఎస్ఐ ఎమ్మెల్యే తిప్పేస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తి స్థాయిలో నివారించడానికి చర్యలు తీసుకోవాలని నూతన ఎస్ఐకు ఎమ్మెల్యే సూచించారు.

పర్యాటకుల సందడి



అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న పర్యాటకులు, భక్తులు

లేపాక్షి: మండల కేంద్రంలోని వీరభద్రస్వామి దేవాలయం సమీపంలో ఉన్న అన్నదానం సత్రంలో ఆదివారం ఉదయం పర్యాటకుల సందడి చోటు చేసుకుంది. లేపాక్షి ఆలయాన్ని సందర్శించి శిల్పాలు, చిత్రలేఖనాలను తిలకించారు. అనంతరం పర్యాటకులు, భక్తులు అన్నదాన సత్రంలో భోజనం చేశారు. కొంత మంది భక్తులు అన్నదాన సత్రం నిర్వహణకు సహాయ సహకారాలను అందజేశారు.

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం



పీర్ల వద్ద ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున మొహర్రం సందర్భంగా నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 13వ వార్డు పరిధిలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొని పీర్లకు ప్రత్యేక పూజలు జరిపారు. అగ్నిగుండ మహోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. పప్పులు, బెల్లం, బొరుగుల వేసి ప్రజలు తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, కౌన్సిలర్ మేఘన, స్థానిక నాయకులు జయరాజ్, మధు, సుధీర్‌రెడ్డి, సత్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు భూమి పూజ



ఆర్‌కే థియేటర్ రోడ్డులో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

గోరంట్ల: మేజర్ పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో కమ్మవారిపల్లి రోడ్డు నుంచి ఆర్‌కే థియేటర్ వరకు సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి సర్పంచు సరోజాబాయి ఆదివారం భూమిపూజ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ మేజర్ పంచాయతీలోని ఐదు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి రూ.కోటి నిధులు విడుదలయ్యాయన్నారు. అందులో భాగంగా పలు వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు రొద్దంలో 'స్పందన'

పెనుకొండ: రొద్దం మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమం జరుగుతుందని సబ్ కలెక్టర్ కార్తీక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9: 30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. అధికారులు పాల్గొంటారన్నారు.

రత్నగిరి టు తైవాన్ !

చదువుకు పేదరికం అడ్డుకాదని ఇప్పటికే ఎంతో మంది నిరూపించారు. ఆ కోవలోకే వస్తారు మంజునాథ్. తినుబండారాలు అమ్ముతూ తల్లిదండ్రులిద్దరూ చదువుకు సాయం చేయగా.. వారి నమ్మకాన్ని ఏ మాత్రం వమ్ము చేయకుండా చదువుకున్నారు. మంజునాథ్ ఇటీవలే పీహెచ్‌డీ పట్టా అందుకొని ఉన్నత చదువు కోసం తైవాన్ వెళ్లారు.

- పేదింట్లో వికసించిన విద్యా కుసుమం
- పీహెచ్‌డీ పట్టాతో సత్తాచాటిన మంజునాథ్
- ప్రస్తుతం తైవాన్‌లో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్
- తినుబండారాలు అమ్మి కుమారుడి చదువుకు తల్లిదండ్రుల సాయం



తైవాన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న మంజునాథ్

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామానికి చెందిన తిప్పమ్మ , క్రిష్ణప్ప కుటుంబానికి సెంటు భూమి కూడా లేదు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తిప్పమ్మ, క్రిష్ణప్ప పెద్దగా చదువుకోలేదు. గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో 2005 నుంచి 2014 వరకు చిన్న బంకులో హోటల్ నడిపేవారు. అయితే హోటల్ ద్వారా వచ్చే ఆదాయంతో పిల్లల విద్యాభ్యాసం చేయించడం కోసం ఏమాత్రం సరిపోక పోవడంతో మూసి వేశారు. సొంతంగా వ్యాపారం చేసి ఆదాయం మార్గం ఎంచుకోవాలని నిర్ణయించుకున్నారు. దీంతో తినుబండారాలు చేయడంలో తిప్పమ్మ .. క్రిష్ణప్పకు సాయంగా నిలవడంతో అదే మార్గాన్ని ఎంచుకున్నారు. ఇంటి వద్దనే చిన్నకొట్టంలోనే నిప్పట్లు, చిక్కీలు, స్వీట్లు రుచికరంగా తయారు చేసే చిన్న కుటీరాన్ని ప్రారంభించారు. తయారు చేసిన తినుబండరాలను సొంతంగా ద్విచక్ర వాహనంలో మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ మండలాల్లో, కర్ణాటక ప్రాంతం హొసకెర, బడవనహళ్లి, మిడిగేశి, రంటవాళ, నేరళకెర వంటి ప్రాంతాల్లో నిత్యం అంగళ్లు, హొటళ్లకు హోల్‌సేల్‌గా విక్రయిస్తూనే బిడ్డలను చదివించారు.

పేదింటిలో పుట్టినా...

మంజునాథ్ పేదింటిలో పుట్టినా ఎప్పుడూ వెనుకడుగు వేయలేదు. రత్నగిరి గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసి కర్ణాటకలోని మధుగిరిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదివారు. ఆ తర్వాత తుమకూరులో ఎంఎస్సీ పూర్తి చేశారు. అనంతరం బెంగళూరులోని దిప్రెసిడెన్సి యూనివర్సిటీలో చేరి డాక్టర్ మహబూబ్‌బాషా పర్యవేక్షణలో 'సింథసిస్ అండ్ స్టడీ ఆఫ్ స్ట్రక్చరల్, ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ట్రాన్సిషన్ మెటల్ డోప్డ్ నానోపార్టికల్స్' అనే అంశంపై పీహెచ్‌డీ పూర్తి చేసి పట్టా అందుకున్నారు. పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపిక కావడంతో ప్రస్తుతం తైవాన్ దేశంలోని ప్రసిద్ధ నేషనల్ డాంగ్ హెచ్ డబ్ల్యూఏ యూనివర్శిటీలో చదువు కొనసాగిస్తున్నారు.

నేటికీ అదే వ్యాపారం

బిడ్డల పెళ్లిళ్లు పూర్తి చేయడంతో పాటు ఓ కుమారుడు ఎంఎన్‌సీ కంపెనీలో పనిచేస్తున్నా ఇప్పటికీ ఆ వృద్ధ దంపతులు గ్రామాల్లో తిరుగుతూ తినుబండారాలను అమ్ముతున్నారు. తిప్పమ్మ, క్రిష్ణప్ప కుటుంబాన్ని నేటి తరం ఆదర్శమని రత్నగిరి వాసులు కొనియాడుతున్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

పేద కుటుంబంలో పుట్టినా ఎప్పుడూ చదువులో వెనక్కి తగ్గలేదు. మా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఉన్నత విద్య అభ్యసించే అవకాశం లభించింది. వాళ్లలా కష్టపడకూడదని మా కోసం వారు ఎంతో కష్టపడ్డారు. అమ్మానాన్నతో పాటు పుట్టిన ఊరు గర్వపడేలా ముందుకెళ్తాను.

– మంజునాథ్ , తైవాన్

సక్సెస్ స్టోరీ



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న మంజునాథ్ (ఫైల్)

తమలా కష్టపడకూడదనే...

ప్రస్తుతం సమాజంలో నలుగురు బిడ్డలకు ఉన్నత విద్యాభ్యాసం చేయించి ప్రయోజకులను చేయడం అంత ఆషామాషీ కాదు. అయితే తాము పడుతున్న కష్టాలు తమ పిల్లలకు రాకూడదనే ఆ దంపతులు ఎంతో పట్టుదలతో పిల్లలను ప్రయోజకులను చేశారు. ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా.. కుమార్తెలనూ చదివించి పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపారు. మూడో సంతానమైన గోవిందరాజు డిగ్రీ పూర్తవగానే బెంగళూరులోని ఓ ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. నాల్గవ కుమారుడైన మంజునాథ్ పీహెచ్‌డీ పట్టా అందుకుని ఇటీవల ఉన్నత విద్యాభ్యాసం కోసం తైవాన్ దేశానికి వెళ్లారు.



ద్విచక్ర వాహనాల్లో తినుబండారాలు తరలిస్తున్న క్రిష్ణప్ప

గ్రంథాలయం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ

పెనుకొండ: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి కె. మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

పీర్లచావిడి నిర్మాణానికి సహకరించండి



పీర్ల చావిడి లేక పందిరి వేసిన దృశ్యం

చిలమత్తూరు: మండలంలోని కనిశెట్టిపల్లిలో పీర్ల చావిడి వర్షాలకు కూలిపోవడంతో గత పది సంవత్సరాలుగా గ్రామస్థులు పందిరి వేసుకుని ఇబ్బందులు పడుతున్నారు.. చావడి నిర్మిస్తామని చాలా మంది హామీలు ఇచ్చి అమలు చేయలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. పండుగను ఘనంగా జరుపుకుంటున్నా, పీర్ల చావిడి లేక అవస్థలు పడుతున్నామన్నారు..దాతలు, ప్రజా ప్రతినిధులు చావిడి నిర్మాణానికి ఆర్థికసాయం చేస్తే వచ్చే ఏడాదైనా పండుగను వైభవంగా జరుపుకుంటామని గ్రామస్తులు, మాజీ ఎంపీటీసీ సూర్యనారాయణ, డీలర్ శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, శివప్ప, సిద్దప్ప,శివ కోరారు..

యువకుడికి తీవ్రగాయాలు

సోమందేపల్లి: మండలంలోని పేటకుంట సమీపంలోని ఎస్ఎల్ ఏపీ పరిశ్రమ ఎదుట ద్విచక్ర వాహనం బోల్తా పడి శ్రీనివాసులు అనే యువకుడు ఆదివారం తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు నుంచి ద్విచక్ర వాహనంపై బొమ్మనహాళ్ మండలం గంగినే పల్లికు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన యువకుడిని 108 వాహనంలో చికిత్స కోసం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లిలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన వెంకటేష్, ఆదినారాయణ గాయపడ్డారు. మొహర్రం సందర్భంగా అగ్నిగుండం వద్ద రెండు వర్గాల వారు ఘర్షణపడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జలధికి తరలిన పీర్లు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో కులమతాలకు అతీతంగా మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామాల్లోని పీర్ల మకాన్ల దగ్గర ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. కొన్నిచోట్ల అగ్నిగుండం మహోత్సవం, జలధి కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే ప్రత్యేక ప్రార్థనల తర్వాత డప్పు శబ్దాల మధ్య పీర్ల స్వాములు అగ్నిగుండ ప్రవేశం చేశాయి.

– సాక్షి నెట్ వర్క్:



పావగడ: పీర్ల ఊరేగింపులో ఆకట్టుకున్న మహిళా వేషధారి



గౌడనహళ్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



పావగడ: పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



రొళ్ల: రత్నగిరిలో జలధికి తరలుతున్న పీర్లు



హిందూపురం టౌన్ ఎస్.సడ్లపల్లిలో బాబయ్యను ఊరేగిస్తున్న దృశ్యం



లేపాక్షి: గలిబిపల్లిలో గుండం చుట్టూ అలావ్ తొక్కుతున్న భక్తులు



గొల్లపల్లిలో పీర్లను ఏటికి తరలిస్తున్న దృశ్యం



సోమందేపల్లి : పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



లేపాక్షిలో..



పరిగిలో బాబయ్యస్వాములను జలధికి తరలిస్తున్న దృశ్యం

రోటరీ అధ్యక్షుడిగా సత్య లోకేశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న సత్య లోకేశ్

పావగడ: స్థానిక రోటరీ క్లబ్ 34 వ అధ్యక్షుడిగా సత్య లోకేశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రోటరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ పీడీజీ రొటేరియన్ హెచ్ రాజేంద్ర రై మెడల్ వేయడం ద్వారా సత్య లోకేశ్ అధ్యక్ష స్థానాన్ని అధిరోహించారు. రోటరీ కార్యదర్శిగా వి.రామాంజి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి, మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్య లోకేశ్ మాట్లాడుతూ విద్య, వైద్య సేవలకు పెద్ద పీట వేస్తామన్నారు. రోటరీ మాజీ అధ్యక్షుడు వైఎస్ హనుమంతరాయప్ప, ప్రభాకర్, మహ్మద్ ఇమ్రాన్, గొర్తి నాగరాజు, కమల్ బాబు , కసాప అధ్యక్షుడు కట్టా నరసింహహార్తి తదితరులు పాల్గొన్నారు.

కష్టానికి తగ్గ ఫలితం దక్కలేదు

పావగడ: స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో చాలా కాలం విధులు నిర్వహించిన తమకు కష్టానికి తగిన ఫలితం దక్కలేదని మాజీ ఉద్యోగులు ఆరోపించారు. స్థానిక అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన ఆందోళనలో మాజీ ఉద్యోగి నాగమణి మాట్లాడుతూ ఆ ఆరోగ్య కేంద్రంలో తాను 32 సంవత్సరాలు ఆరోగ్య సేవకురాలి గా విధులు నిర్వహించానని, సంస్థ నిర్వాహకుడు స్వామి జపానంద తనను అనారోగ్యం నెపంతో నిర్దాక్షిణ్యంగా ఉద్యోగం నుంచి తొలగించి పీఎఫ్ సొమ్ము రూ.65 వేలు మాత్రమే అందించి బయటకు పంపేశాడని ఆరోపించారు. ఈ సంస్థ మాజీ ఉద్యోగులు మానం శశికిరణ్, మల్లికార్జున, బాలు మాట్లాడుతూ తాము కూడా ఆ సంస్థలో ఏడేళ్లు కంటి విభాగంలో పని చేశామని, తమకు రావలసిన పిఎఫ్ సొమ్ము చాలా తక్కువగా ఇచ్చాడన్నారు. పీఎఫ్ వివరాలు తమకు తెలియ నివ్వకుండా జాగ్రత్త పడుతున్నాడని ఆరోపించారు. కిసాన్ రైతు సంఘం అధ్యక్షుడు నాగభూషణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బాధిత ఉద్యోగులు

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

హిందూపురం టౌన్: అందరం సమష్టిగా 2024 ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రముఖుల ఇళ్లకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి, బాబురెడ్డి తదితరులు వెళ్లి తేనేటి విందులో పాల్గొన్నారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యమని, అందుకు అందరి సహాయ సహకారాలు అందించాలని ఆమె కోరారు. అందరం ఒక్కటిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో పనిచేసి, హిందూపురం నియోజకవర్గంలో పార్టీని గెలిపించి సీఎంకు బహుమతిగా అందివ్వాలన్నారు. పట్టణంలోని జామియా మసీద్ సానే ముతవల్లీ హుమయూన్, ప్రముఖ న్యాయవాది రామచంద్రారెడ్డి, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులను వారు కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, వైస్ చైర్మన్ జబీవుల్లా, జెడ్పీటీసీ బాణాల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, కౌన్సిలర్ మారుతిరెడ్డి, సర్పంచ్ నంజప్ప, నక్కలపల్లి శ్రీరామిరెడ్డి, సీపీసీ సాధిక్, రాంమూర్తి, నాగమణి, సోమశేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఇలియాజ్, కదిరీష్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాది రామచంద్రరెడ్డిని కలసిన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక, నాయకులు

మణిపూర్ దుర్ఘటన అమానవీయం

పావగడ: మణిపూర్ దుర్ఘటన అమానవీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి గిరీశ్ పేర్కొన్నారు. స్థానిక శనిమహాత్మ సర్కిల్ వద్ద ఆదివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరీశ్ మాట్లాడుతూ మణిపూర్‌లో 150 మంది హత్య కు గురయ్యారని. ఇద్దరు యువతులను వివస్త్ర చేసి ఊరేగించడం సిగ్గు చేటన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఇంటికి పోవాల్సిందేనన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రామకృష్ణ, ఈర దాసప్ప, రమేశ్, భూలక్ష్మి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై ర్యాలీ

పెనుకొండ: మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలని పట్టణానికి చెందిన పలువురు మైనార్టీలు ఆదివారం రాత్రి శాంతిర్యాలీ నిర్వహించారు. కొవ్వొత్తులు చేత పట్టుకొని మణిపూర్‌లో శాంతినెలకొల్పాలని, కుకీలను రక్షించాలని, మానవహక్కులను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం దర్గా సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేశారు.

ఘనంగా గంధం వేడుకలు

సోమందేపల్లి: మండలంలోని తుంగోడు గ్రామంలో వెలసిన షా ఫక్రుద్దీన్ బాబా గంధం వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. గ్రామంలో మొహర్రం సందర్భంగా జలధి కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను బాబా దర్గా వద్దకు తీసుకొచ్చి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, పీఠాధిపతి జిక్రియ హుసేనీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మండల పూజ

రొళ్ల: ఎం.రాయాపురంలో నాగదేవతల ప్రతిష్ఠ చేపట్టి 41 రోజులు కావడంతో ఆదివారం మండల పూజ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మణులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు తీర్థప్రసాదంతో పాటు అన్నదానం కూడా చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.